
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 1 ఏప్రిల్ 2025

పెద్ద లోటు

తుమ్మలకు సాహిత్య వర్గాల నివాళి

కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ వర్సిటీ మాజీ వీసీ, కథారచయిత తుమ్మల మరణంపై వర్సిటీ వర్గాలు, సాహిత్య వర్గాలు సంతాపం ప్రకటించాయి. ఆయన సాహిత్య కృషినీ, తమ అనుబంధాన్నీ పలువురు గుర్తు చేసుకుంటున్నారు.

ఆయన రాయాల్సింది ఇంకా చాలానే ఉంది. రాస్తాననీ చెప్పాడు. భోళా మనిషి. వృత్తి కథలకు దారి చూపి వెళ్లిపోయాడు. గొప్ప స్నేహశీలిని కోల్పోయాం.

- మధురాంతకం నరేంద్ర, కథా రచయిత

1980లలో ఎస్వీయూనివర్సిటీ ఎఫ్ బ్లాక్‌లో తుమ్మల రామకృష్ణతో మొదలైన పరిచయం నాతో సహా సాహిత్య వర్గాలకు గట్టి స్నేహంగా మారింది. మా అందరిలోకీ చిన్నవాడు. అందరం చినబ్బా అని పిలిచేవాళ్లం. ఆయన లేడంటే నమ్మలేకున్నాం.

-ప్రొఫెసర్ డి.కిరణ్ క్రాంత్ చౌదరి

ఆయన లేని లోటు బహుజన సాహిత్యాన్ని ఎక్కువగా బాధిస్తుంది. ఆయన కథలు 'అడపం మేలుకొంది', 'మహా విద్వాంసుడు' బహుజన సాహిత్యానికి ప్రతీకలుగా నిలిచాయి.

- శ్రీదేవి, ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు

చదువుకునే రోజుల్లో గాంధీరోడ్డులోని డీలక్స్ హోటల్ గురువు కేతు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సాహిత్య చర్చలు జరిగేవి. తుమ్మల క్రియాశీలి. ఒక చిన్న పల్లె నుంచి బీసీ నేపథ్యం నుంచి వచ్చి హైదరాబాదు సెంట్రల్ వర్సిటీ ఆచార్యుడుగా చేరి, ఒక వర్సిటీ వైస్ చాన్సలర్ అయ్యాడు. గొప్ప మిత్రుడిని కోల్పోయాం.

- డాక్టర్ వి.ఆర్.రాసాని, రచయిత

మూగబోయిన బహుజన స్వరం

ద్రావిడ మాజీ వీసీ, కథారచయిత తుమ్మల రామకృష్ణ మృతి



కుప్పం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):తెలుగు కథా సాహిత్యంలో బహుజన స్వరాన్ని బలంగా వినిపించిన ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ మృతి, సాహిత్య వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసిన ఈయన సోమవారం ఉదయం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఆఖరి శ్వాస విడిచారు. కథా రచయితగా ప్రసిద్ధుడైన ఆచార్య తుమ్మల రామకృష్ణ స్వస్థలం చిత్తూరు జిల్లా సోమల మండలం ఆవులపల్లె గ్రామం. పెద్దఉప్పరపల్లె, నెరబైలు గ్రామాలలో హైస్కూలు దాకా చదువుకున్న ఆయన ఇంటర్మీడియట్ తిరుపతిలో చదువుకున్నారు. శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో ఎంఫిల్, పీహెచ్‌డీ తీసుకునేదాకా ఉన్నత విద్యాభ్యాసం సాగింది. హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు ఆచార్యుడిగా పదవీ విరమణ చేసిన తర్వాత ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా 2020లో నియమితులయ్యారు. 2023, నవంబరు 25న ఇక్కడే పదవీ విరమణ చేశారు. ద్రావిడ యూనివర్సిటీ రాజకీయాల్లో ఆయన నలిగిపోయారు. ఈ సమయంలోనే అనారోగ్యానికి కూడా గురయ్యారు. హైదరాబాదులోని లింగంపల్లిలో ఉంటూ చికిత్స తీసుకునేవారు.

బహుజన కెరటం: తుమ్మల కలం బహుజన ధిక్కార స్వరం. 'అడపం మేలుకొంది' అన్న తుమ్మల కథ చిత్తూరు జిల్లా ఊళ్లల్లో నేటికీ మారని బహుజనుల జీవితాల వేదన తెలియజేస్తుంది. తుమ్మల రామకృష్ణ రాసిన 'మహా విద్వాంసుడు' కథ - సంగీతంలోని వివక్షను ఎత్తి చూపుతుంది. ఊబి, ఊరిమద్దిస్తం, ఓ సాయంత్రం, డాక్టర్ గుర్నాథం, పరాభవం, రాలిన చింత, రేగడిమిట్ట, స్పెషల్ స్క్వాడ్ వంటి కథలతో ' మట్టిపొయ్యి' సంపుటి ప్రచురించారు. తెల్లకాకులు అనే కథను పుస్తకంగా ప్రచురించారు. ఇది అనేక భాషల్లోకి అనువాదం అయ్యింది. కర్నూలులో కథా సాహిత్య వాతావరణాన్ని పునరుజ్జీవింపజేసిన కథకుడిగా తుమ్మలను గుర్తిస్తారు. ఇక్కడి నుంచి ఆయన చొరవతో వచ్చిన 'పల్లెమంగలి కథలు' తెలుగు కథాసాహిత్యంలో బహుశా తొలి వృత్తి కథల సంకలనం. ఆయన సారథ్యంలోనే అడపం పేరుతో వృత్తి కథల సంకలనం వెలువడింది. 'పరిచయం', 'బహుముఖం', 'అవగాహన' వ్యాస సంపుటాలు, 'అభివందనం' పేరుతో సమీక్షలు - ప్రసంగాలు పుస్తకాలుగా వెలువడ్డాయి. ఆయన రచనలు అనేకం తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటూ మరాఠీ, హిందీ, ఇంగ్లీషుల్లోకీ అనువాదం అయ్యాయి. ఆయన సాహిత్య కృషిపై పలువురు రాసిన వ్యాసాలతో 'సీమ సంతకం' అనే పుస్తకం వెలువడింది. ఎనభైల తర్వాత ఊపందుకున్న అస్తిత్వ ఉద్యమాల జాడలు తుమ్మల రామకృష్ణ రచనల్లో కనిపిస్తాయి. స్వయంగా ఒక బహుజనునిగా పొందిన అనుభవాలు, సంవేదనల ప్రతిధ్వనులు వినిపిస్తాయి. ఆయన ఎలుగెత్తిన బహుజన ధిక్కార స్వరం ఇంకా గట్టిగా, వేయిగొంతుకుల పెట్టుగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.



చేతి రాతలు కాస్త అరిగినా.. చిన్నపాటి సాంకేతిక సమస్య తలెత్తినా వేలిముద్రలు పడేవి కావు. దీంతో పింఛన్ల కోసం వృద్ధులు.. సచివాలయ సిబ్బంది నిరీక్షించే వారు. దీనికి పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్-1 డివైజ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారానే మంగళవారం నుంచి పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

పింఛనుదారులకు 'సాంకేతిక' భరోసా

- ఎల్-1 ఆర్డీ పరికరాలతో వేలిముద్ర సమస్యకు పరిష్కారం
- వీటితోనే నేటి నుంచి పింఛన్ల పంపిణీ

వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీకి ఎల్-0 ఆర్‌డీ పరికరాలను సచివాలయ సిబ్బందికి ఇచ్చారు. ఇవి సరిగా పనిచేయలేదని పలుమార్లు ఫిర్యాదుచేసినా అప్పట్లో పట్టించుకోలేదు. వేలిముద్రలు పడకపోవడంతో గంటల కొద్దీ పండుటాకులు వేచి ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ఎల్-1 ఆర్‌డీ పరికరాలను యూఐడీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆధార్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించారు. దీనిపై గీతలు పడినా, తేమ ఉన్నప్పటికీ వేలిముద్రలను నాణ్యతగా స్కాన్ చేస్తుంది. అలాగే అక్రమాలకూ చెక్ పెడుతుంది. కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలిముద్రలను రూపొందించి పింఛన్లను పక్కదారి పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు యూఐడీఏఐకి చేరాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎల్-1 పరికరాలను కొనాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 5,264 పరికరాలు పంపింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎల్1 ఆర్డీ స్కానర్లను అన్ని సచివాలయాలకు పంపామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆధార్ అనుసంధానంతో కూడిన ఈ పరికరం పింఛనుదారులకు సాంకేతిక భరోసాలాంటిదన్నారు. వీటి ద్వారా ఎటువంటి లోపాలకు తావులేకుండా వేలిముద్రలు పడతాయని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారులు నారాయణరెడ్డి, కోఆర్డినేటర్ జగదీష్ సోమవారంరాత్రి తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి ఎల్-1 పరికరాల ద్వారా 2,61,841 మందికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

ఒకటో సారి.. రెండో సారి.. మూడో సారి..!



- పారదర్శక టెండర్లతో తిరుపతి కార్పొరేషన్‌కు పెరిగిన ఆదాయం
- వైసీపీ హయాంలో గుట్టుచప్పుడు కాకుండా నొక్కుడు
- ఒక్క మార్కెట్లోనే రూ.రెండు కోట్లకుపైగా వ్యత్యాసం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ జమానాలో చిన్నా చితకా వాటికి కూడా టెండర్లు గోప్యంగా జరిగిపోయేవి. ముఖ్యంగా తిరుపతి కార్పొరేషన్‌లో జరిగే టెండర్లలో గోల్‌మాల్ అంతా ఇంతా కాదు. బహిరంగ వేలం పేరు పెట్టి 'ఒకటోసారి.. రెండోసారి.. మూడోసారి..' అనే మాటలు లేకుండానే పనికానిచ్చేశారు. వేలంలో బయటవారు రాలేరు. వద్దామంటే అసలు టెండరు ఎప్పుడు జరుగుతుందో తెలియదు. తెలుసుకునేలోపు నాలుగు గోడల మధ్య చీటీలు వేసి పంచుకునేసేవారు. అన్న క్యాంటీన్లు మొదలకుని, కపిలతీర్థం సర్కిల్ మెరిడియన్ హోటల్ వరకు, స్క్రాప్ టెండర్ నుంచి మార్కెట్ టెండర్ల వరకు, ఇంజనీరింగ్ పనులైతే ఏకనిరంజన్ పనికానిచ్చేవారు.

తాజాగా కార్పొరేషన్ పరిధిలో జరిగిన టెండర్లను పరిశీలిస్తే వైసీపీ హయాంలో అడ్డగోలుతనం బయటపడింది. 2024 వరకు ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండరు రూ2.58కోట్లు మాత్రమే. కూటమి అధికారంలోకి వచ్చాక జీఎస్టీతో కలిపి దాదాపు రూ.5 కోట్లకు ధర పలికింది. పాలకపక్షం పారదర్శకంగా టెండర్లు నిర్వహిస్తే మార్కెట్ అసలు ధర ఎంతో ఇప్పుడు బయటపడింది. అంటే గత వైసీపీ పాలనలో ఒక్క మున్సిపల్ మార్కెట్ పైనే ఏడాదికి రూ.2 కోట్లకుపైగా కార్పొరేషన్ ఆదాయానికి గండి పడిందంటే తక్కినవాటిలో ఎంత నొక్కేసారో అర్థం చేసుకోవచ్చు.

పార్కింగ్ అడ్డాలనూ దోచేశారు

తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలనూ వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా దోచేశారు.

- 2022-23లో భారతి బస్టాండు పార్కింగ్ టెండరు రూ3.37లక్షలు. 2023-24కు దీనిని రూ2.23లక్షలకు తగ్గించి కట్టబెట్టారు. ఇదే బస్టాండుకు 2024-25లో రూ7.12లక్షలు, తాజాగా రూ10.40లక్షలు ధర పలికింది. అంటే వీటినుంచీ కార్పొరేషన్ ఆదాయానికి వైసీపీ హయాంలో గండికొట్టేశారు.
- జీఎస్ మాడవీధి పార్కింగ్ స్థలాలు టెండరులోనూ భారీ వ్యత్యాసం కనిపించింది. వైసీపీ హయాంలో రూ1.25లక్షలు ఉన్న మాడావీధి టెండరు ప్రస్తుతం రూ3.35లక్షలతో రెండింతలు పలికింది.

రాజకీయ జోక్యం లేకపోవడంతో..

కార్పొరేషన్ పరిధిలో జరిగే టెండర్లలో రాజకీయ జోక్యం లేకపోవడం వల్లే పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించడంతో భారీగా ఆదాయం సమకూరింది. గతంలో వైసీపీ పెద్దలు చెప్పినట్టే అధికారులు తలలు ఆడించడంతో అయినవారికి కార్పొరేషన్ ఆస్తులను చౌకగా కట్టబెట్టేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో జనబాహుల్యంలో ఉన్న పత్రికలకు ప్రకటనలు ఇచ్చి విస్తృత ప్రచారం చేసి టెండరు నిర్వహించడం వల్ల పాట దారుల్లో పోటీతత్వం పెరిగినట్టు కనిపిస్తోంది.

నాడు- నేడు వేలం పాటల వివరాలు

	కూరగాయల మార్కెట్	రామచంద్రగుంట కట్ట	జంతువధశాల	చిన్నవీధులు	భారతీ బస్టాండ్ పార్కింగ్ స్థలాలు	జీఎస్ మాడవీధి పార్కింగ్ స్థలాలు
2022-23	రూ. 2,30,40,000	రూ. 1,94,000	రూ. 3,18,600	రూ. 14,32,000	రూ. 3,27,000	------------
2023-24	రూ. 2,58,05,700	రూ. 2,15,554	రూ. 4,17,672	రూ. 15,90,948	రూ. 2,52,924	రూ. 1,25,676
2024-25	రూ. 4,81,50,000	రూ. 2,32,500	రూ. 4,27,500	రూ. 19,57,500	రూ. 7,12,500	రూ. 1,39,800
2025-26	రూ. 4,76,00,000	రూ. 2,34,000	రూ.4,00,000	రూ. 33,00,030	రూ. 10,40,000	రూ. 3,35,599



భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

రంజాన్ సందర్భంగా జిల్లా అంతటా ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. నెల రోజుల ఉపవాస దీక్షలను పూర్తి చేసుకున్న వీరు ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో రద్దు చేయాలని కోరుతూ కొందరు నల్లబ్యాడ్జీలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

చిన్నపొరపాటు చేసినా నో ఎంట్రీ

- 2 గంటల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

తిరుపతి(విద్య), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌కు సన్నద్ధం కావడమే కాదు.. పరీక్షలకు వెళ్లే ముందు ఏ చిన్న పొరబాటూ జరగకుండా అప్రమత్తంగా ఉండాలి. లేదంటే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ పరీక్షలు మంగళవారం నుంచి 9వ తేదీ వరకు జరుగనున్నాయి. పేపర్-1 పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా (బీఈ, బీటెక్) జరుగుతుంది. 9వ తేదీ ఉదయం పేపర్-2ఏ (బీఆర్క్) పరీక్ష, పేపర్-2బీ ప్లానింగ్ పరీక్షలు జరుగుతాయి. గతంలోనే మొదటి సెషన్ మాదిరిగానే కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్‌టీఏ నిబంధనలను తప్పకుండా అనుసరించాలి. అడ్మిట్ కార్డులోనూ వాటిని పొందుపరిచారు.

- నిర్దేశిత సమయానికి రెండు గంటలు ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష సమయానికి అరగంటముందే కేంద్రంలోకి అనుమతిస్తారు.
- సాధారణ వస్త్రాలనే ధరించాలి. ఆభరణాలు, వాచీలు ధరించకూడదు. సాధారణ చెప్పులనే వేసుకోవాలి.
- బ్లూ, బ్లాక్ కలర్ బాల్‌పాయింట్ పెన్నులను తీసుకువెళ్లాలి.
- ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌నే అనుమతిస్తారు.
- దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఆధార్, పాన్ తదితర ఒరిజినల్ ఐడెంటిటీ కార్డులను వెంట తీసుకెళ్లాలి.
- ఎన్‌టీఏ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు కింది భాగంలో సూచించిన బాక్సులో కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఫొటోనే ఇక్కడా అతికించాలి.
- ఆ పక్కనే ఉన్న మరో బాక్స్‌లో విద్యార్థి ఎడమ చేతి వేలిముద్ర వేయాలి.
- మూడో బాక్సులో పరీక్ష కేంద్రంలోకి వెళ్లాక ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేయాలి.
- విద్యార్థి అడ్మిట్ కార్డుతోపాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు మరొక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను తీసుకువెళ్లాలి.

తనిఖీల్లేకుండా 'కొండ'కు అనుమతించకండి

- 'అలిపిరి'లో అప్రమత్తంగా ఉండాలి
- తిరుమల భద్రతపై పోలీసు, విజిలెన్సు అధికారులతో ఎస్పీ సమీక్ష



తిరుపతి(నేరవిభాగం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల భద్రతపై ఎస్పీ హర్షవర్ధనరాజు ఫోకస్ పెంచారు. 'అలిపిరి' వద్ద తనిఖీల్లేకుండా తిరుమలకు అనుమతించొద్దని.. టోల్‌గేటు వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సోమవారం ఉదయం ఓ యువకుడు అలిపిరి చెక్‌పాయింట్‌లోని వీఐపీ లైను గుండా బైకులో దూసుకెళ్లగా.. జీఎన్సీ టోల్‌గేటు వద్ద అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయశేఖర్, టీటీడీ వీజీవో రాంకుమార్, అలిపిరి ఏవీఎస్‌వో రాజశేఖర్, సిబ్బందితో ఎస్పీ దాదాపు రెండు గంటల పాటు సమీక్షించారు. ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న భక్తుడిని ఎందుకు గుర్తించలేక పోయారని ఎస్పీ ప్రశ్నించినట్లు తెలిసింది. వీఐపీ దారిలో ఎంతమంది డ్యూటీలో ఉన్నారని తెలుసుకున్నారు. ఆపినా.. ఆపకుండా సిబ్బందిపైకి దూసుకొంటూ రావడంతో తప్పించుకుని వెళ్లడానికి కారణమైందని ఎస్పీకి అధికారులు వివరించినట్లు సమాచారం. అలిపిరి టోల్‌గేటు వద్ద మరింత అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పటిష్ఠ తనిఖీలతో నిషేధిత వస్తువులు.. పదార్థాలకు అలిపిరి వద్దే అడ్డుకట్ట వేయాలన్నారు.

చిన్న పిల్లలు, వృద్ధులు మిస్సింగ్‌పై ఆరా

తిరుమలలో తరచూ వృద్ధులు, చిన్నపిల్లలు తప్పిపోవడం, కిడ్నాప్‌కు గురవడంపైనా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆరా తీశారు. దీనికోసం ఆలయ ప్రధాన ద్వారం వద్ద సమాచార కేంద్రం ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే దానిపై అధ్యయనం చేయాలన్నారు. యాత్రికులు తప్పిపోతే వెంటనే గుర్తించేలా టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయడంపైనా చర్చించినట్లు తెలిసింది. గత ఐదేళ్లలో 400 నుంచి 450 మంది పిల్లలు, 400 మంది వృద్ధులు తప్పిపోగా 75 శాతం మందిని గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈ క్రమంలో చిన్నపిల్లలకు అలిపిరి వద్దే ట్యాగ్‌లు వేయడం.. వృద్ధుల కోసం యాప్ రూపొందించడంపైనా సమీక్షించినట్లు సమాచారం. తిరుమలలో అనధికార వ్యక్తుల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

6 నుంచి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

● నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



చంద్రగిరి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కోదండరామ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 6 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఈక్రమంలో మంగళ వారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. 10 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. 5వతేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 6న ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య ధ్వజారోహణం నిర్వహిస్తారు. 10న సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంట వరకు హనుమంత వాహనంపై స్వామి వారు విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 11న ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. 12న కల్యాణోత్సవం, సాయంత్రం గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించనున్నారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనదలచిన వారు రూ.750 చెల్లించి గృహస్థులు(ఇద్దరు) పాల్గొనవచ్చు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో సీతాదేవి - బండ్ల గణేష్

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ పీఎం వీపీ సింగ్ సతీమణి సీతాదేవి, సినీ నిర్మాత బండ్ల గణేష్, ఎమ్మెల్యే విజయశ్రీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక



తిరుపతి రూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపల్లెలోని ప్రైవేట్ పాఠశాలలో రెండ్రోజులపాటు నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘ వార్షికోత్సవం సోమవారంతో ముగిసింది. సంఘానికి కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా రామ్మూర్తిరెడ్డి, తిరుమలరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సుబ్రమణ్యంరెడ్డి, ఉపాధ్యక్షులుగా కుమారస్వామిరెడ్డి, కోటిరెడ్డి, కోశాధికారిగా డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి లను ఎన్నుకున్నారు. గ్రంథాలయ నిర్వహణ కోసం ఏటా రూ.12వేలు విరాళంగా అందిస్తానని స్విమ్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి ప్రకటించారు.

రిటైరైన విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



బ్రహ్మానందరాజును సన్మానిస్తున్న అధికారులు

తిరుచానూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయ అడిషనల్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మానందరాజు రిటైరయ్యారు. ఈసందర్భంగా తిరుచానూరులో సోమవారం ఆయనను ఘనంగా ఆలయ అధికారులు సత్కరించారు. వీజీవో సదాలక్ష్మి, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకులు, ఆలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

వరసిద్ధుడికి కానుకగా వెండి ఊయల



ఐరాల(కాణిపాకం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పవళింపు సేవకు వినియోగించే వెండి ఊయలను సోమవారం హైదరాబాదుకు చెందిన రాధిక, హరికృష్ణలు కానుకగా అందించారు. 7.5 కిలోల బరువున్న ఈ ఊయల రూ.8,00,000 విలువ చేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. దాతలకు స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

సన్‌రైజ్‌లో రోబోటిక్స్ సందడి



రోబో గురించి విద్యార్థులకు వివరిస్తున్న కరస్పాండెంట్

సత్యవేడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సన్‌రైజ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2డీ, 3డీ, ఏఎల్ రోబోలను ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సతీష్ మా ట్లాడుతూ విద్యార్థులను భావి శాస్త్రవే త్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తమ పాఠ శాలలో ప్రత్యేకంగా రోబోటిక్ క్లాసులను ప్రవేశ పెడు తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి శుక్రవారం విద్యార్థులకు రోబోల ప్రదర్శనను నిర్వహి స్తామన్నారు. కార్యక్రమంలో రోబోటిక్స్ కంపెనీ మేనేజర్ చరణ్, ప్రిన్సిపాల్ ఆశా గోపాల్, ఉపాధ్యాయులు నిర్మల, ఉమ, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అడ్డాగా

అమ్మవారి గర్భాలయం

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకా ళహస్తీశ్వరాలయంలోని అమ్మవారి గర్భాలయ సన్నిధి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉదయ్ అ డ్డాగా మారిందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. వైసీపీ పాలకుల అండతో ఉదయ్ ఐదేళ్లు నిర్విరామంగా అమ్మవారి సన్నిధిలో పర్యవేక్షకు డిగా పనిచేశాడు. దళారీల నుంచి వాటాలుగా తీసుకుంటూ అడ్డదారిలో ఇష్టారాజ్యంగా అంత రాలయానికి ఆ ఉద్యోగి అనుమతిస్తూ పట్టు బడ్డాడు. గత వైసీపీ పాలనలో పలు మార్లు ఈ యనపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తి నప్పటికీ అప్పటి నేతల అండతో ఆ స్థానం నుంచి కదలకుండానే విధులు నిర్వహించాడు. అలాగే గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు భక్తులతో దురుసుగా ప్రవర్తించడంపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అయినా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 9 నెలల క్రితం టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరు వాత ముక్కంటి ఆలయంలో ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ఠ వేసిన 77మంది అధికారులు, ఉ ద్యో గులను ఒకే సారి అంతర్గతంగా బదిలీ చేశారు. ఆ సమయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉదయ్ ను అమ్మవారి సన్నిధి నుంచి అతిథిగృహం ఇన్‌ఛార్జిగా బదిలీ చేశారు.

పది రోజుల్లోనే...

అయితే ఆయన పదిరోజుల తరువాత మళ్లీ అమ్మవారి గర్భగుడి విధులనే కొనసాగించారు. ఏం జరిగిందో తెలి యదు కానీ అధికారికంగా అతిథిగృహంలో విధులు కేటాయించినప్పటికీ 8 నెలలుగా అనధికారికంగా మరింత దర్పంతో అమ్మవారి గర్భగుడి వద్ద తిష్ఠ వేశాడు. ఇటీవల నెల రోజుల నుంచి ఆ ఉద్యోగి ప్రవర్తనపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయిన వారిని, దళారీలను నేరుగా అడ్డదారిలో అమ్మవారి దర్శనానికి అనుమతిస్తున్నారని విమర్శిస్తున్నారు. కొందరు భక్తులు రూ.500 నగదు వెచ్చించి అంతరాలయ టిక్కె ట్టు కొనుగోలు చేసి నిబంధన ప్రకారం ఆల యంలోకి వెళ్తున్నా వారిపై చిర్రుబుర్రులా డుతున్నట్టు చెబుతున్నారు. దురుసుగా ప్రవర్తి స్తున్నట్లు వాపోతున్నారు. అందరూ ఉద్యోగులు అంతర్గతంగా బదిలీ అవుతున్నా ఒప్పంద ఉద్యోగి ఉదయ్ మాత్రం అమ్మవారి సన్నిధిని అడ్డాగా మార్చుకున్నాడని ఆలయంలోని సహచర ఉద్యో గులు అంతా బాహాటంగా విమర్శిస్తున్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి జస్టిస్ కృపాసాగర్



తిరుచానూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జస్టిస్ కృపాసాగర్ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శనివారం రూ.3.65 కోట్లు హుండీ ఆదాయం లభించింది. ఆదివారం శ్రీవారిని 62,263 మంది దర్శించుకున్నారు. 25,733 మంది తలనీలాలు సమర్పించారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

తిరుచానూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పద్మావతి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సమాజం సేవా సమితి పిలుపుతో పద్మావతి ఆర్యవైశ్య యువకిరణాలు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ సునీల్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య యువత రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నిత్యాన్నదాన సమాజ సేవా సమితి అధ్యక్షుడు సతీష్, సభ్యులు రవిచంద్రగుప్త, సతీష్‌కుమార్, కల్యాణ్, సాయిరాం, అనుదీప్, అపర్ణ, ఇందిర, కుమారి, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయలో పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో బాపిరెడ్డి ఉత్తర్వులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ప్రోటోకాల్ విభాగం ఇన్‌ఛార్జిగా ఏఈవో సతీష్‌మాలిక్‌ను, ఏఈవో విద్యాసాగర్‌ను ప్రోటోకాల్‌నుంచి ఆలయం, ప్రసాదం పోటు పర్యవేక్షణకు, ఏఈవో లోకేష్‌బాబును ఆలయం, పోటు నుంచి ల్యాండ్స్ లీగల్ విభాగానికి బదిలీ చేశారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న రాజేశ్వరిని లోబావి ఇంజనీరింగ్ కార్యకలా పాల నుంచి స్కిట్ నర్సింగ్ కళాశాలకు, అలాగే ఏఈ శోభారాణిని శివసదన్ అతిథిగృహం నుంచి లోబావి ఇంజనీరింగ్ కార్యకలాపాలకు, స్థపతి కుమార్‌ను మింట్‌కు బదిలీ చేశారు.

ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి



చికిత్స పొందుతున్న మురళీమోహన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి మురళీ మోహన్‌రెడ్డి(35)పై దాడి చేశారు. ఈ ఘట న శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుడి తెలిపిన వివరాలు... అమ్మపాళెంకు చెందిన మురళీమోహన్‌రెడ్డి శ్రీకాళహస్తి మండ లంలోని రాచగున్నేరి వద్ద ఉన్న ప్రైవేటు కర్మాగారంలో డ్రైవర్. సోమవారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంటి వద్దకు చేరుకుని నిద్ర లేపారు. అయితే పథకం ప్రకారం కర్రలతో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా దాడి చేసి పరారయ్యారు. మురళీమోహన్‌రెడ్డి కేకలు విన్న స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తర లించారు రూరల్ పోలీసలు విచారణను చేపట్టారు.

నీటి ఎద్దడిపై అధికారుల అప్రమత్తం



సాయినగర్‌లో కొత్త బోరు ఏర్పాటు

తిరుపతి రూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో భూగర్భజలాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నీటి ఇబ్బందులను అధిగమించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళిక అమలు చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ చొరవతో మండల, జీపీ నిధులు రూ.42.5లక్షలతో కొత్త బోర్లను మంజూరు చేశారు. ఇప్పటికే తప్పినచోట కొత్త మోటారను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రూ.22.5లక్షలతో కేసీపేట, తనపల్లె, పాడిపేట హౌసింగ్ కాలనీలు, బీటీఆర్‌కాలనీ, సిమల్లవరం, సాయి నగర్,తుమ్మలగుంటలో బోర్లను మంజూరు చేశారు. తిరుచానూరులో రూ.20లక్షల పంచాయతీ నిధులతో ఐదింటిని ఏర్పాటు చేశారు. అవిలాల వాటర్‌సంప్‌ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇది అందుబాటులోకి తీసుకువస్తే ఓటేరు, శ్రీనివాసపురం, అవిలాల, లింగేశ్వరనగర్, గాంధీపురం, వేదాంతపురం పంచాయతీలకు నీటిసమస్య తీరుతుందని భావిస్తున్నారు. గతంలో మండల సమావేశంలో పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి నీటి సమస్యలను తీసుకువచ్చారు. కొత్త బోర్లు అవసరం ఉన్న చోట్ల మంజూరు చేసి డ్రిల్ చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంత్‌కుమార్ తెలిపారు. అవసరమున్న పంచాయతీలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.



చంద్రగిరిలో ప్రార్థనలు చేస్తున్న పులివర్తి వినీల్, చెవిరెడ్డి మోహిత్‌లు-పాకాలలో ముస్లింల ప్రార్థనలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

చంద్రగిరి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా సోమవారం మండలంలోని ముస్లింలు రెడ్డివారిపల్లె వద్ద ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని తనయుడు పులివర్తి వినీల్, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు పాల్గొన్నారు. వినీల్ ముందుగా చేరుకున్నారు. కాస్పేటికి మోహిత్‌రెడ్డి కూడా వచ్చారు. ఇద్దరు ఒకే వరుసలో కూర్చొని ప్రార్థనలు చేసారు. వేరు వేరుగా ముస్లింలను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల్లో పాల్గొనవారందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

చేతికి నల్లబ్యాడ్జిలతో నిరసన

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కూడా నల్ల శాలువా ధరించి ప్రార్థనలో పాల్గొన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును పునఃపరిశీలించి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడానికే నిరసన వ్యక్తం చేసినట్లు ముస్లింలు తెలిపారు. **పాకాల:** స్థానిక కరీంతుల్లాబాద్ సమీపంలోని ఈద్గా వద్ద మత గురువు ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. దామలచెరువు, మొగరాల, రవణక్‌నగర్‌లలో సామూహిక నమాజు చేశారు. **భాకరాపేట:** భాకరాపేట, దీన్‌దార్లపల్లె, దేవరకొండ, కోటబైలు, టి.కుమ్మరపల్లె గ్రామాల్లోని ముస్లింలు ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు చేశారు. గురువులు ధార్మిక ఉపన్యాసాలు చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు. **తిరుపతి రూరల్:** కుంట్రపాకం పంచాయతీ నాగూరుకాలనీ మసీదులో ప్రార్థనలు జరిగాయి. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరయ్యారు. చల్లివేంద్రాన్ని ప్రారంభించారు. పుదిపట్లలో సర్పంచ్ బడి సుధాయాదవ్ పాల్గొన్నారు.

స్వర్ణముఖి పొరంబోకులో ఆక్రమణయత్నం

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



స్థానికులకు నచ్చజెబుతున్న పోలీసులు

తిరుపతిరూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): చిగురువాడ పంచాయతీ పరిధిలో స్వర్ణముఖి నదీ పొరంబోకు భూమిని ఆక్రమించేందుకు సోమవారం పలువురు విఫలయత్నం చేశారు. ఎగువపల్లె, దిగువపల్లె, కొత్తూరులకు చెందిన కొందరు స్థానికులు పెద్దసంఖ్యలో ఉదయం 6గంటలకే చేరుకున్నారు. తాత్కాలిక ఇళ్ల నిర్మాణానికి యత్నించారు. వీఆర్వో రమేష్ వెంటనే ఈ విషయం రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్‌కు తెలియజేశారు. దీంతో రూరల్ పోలీసుల సాయంతో రెవెన్యూ అధికారులు వెళ్లి ఆక్రమణలను అడ్డుకున్నారు. స్థానికులతో సీఐ చిన్నగోవిందు మాట్లాడారు. ఇంటిస్థలాలు కావాలంటే సక్రమ పద్ధతి ప్రకారం రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ భూమిలో దౌర్జన్యంగా ప్రవేశించకూడదన్నారు. ఉదయం 8.30 గంటలకు మరికొందరు స్థానికులు రాగా..రెవెన్యూ అధికారులు, పోలీసులు కలసి వెనక్కి పంపించేశారు. స్థానికులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న సర్వేనంబరు 285/7లోని 5.45 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో నదిపొరంబోకుగా ఉంది. ప్రభుత్వం 1980,1987లలో ఈభూమిని మల్లీశ్వరరెడ్డి అనేవ్యక్తికి సాగుకోసం సెటిల్‌మెంట్ పట్టాను ఇచ్చింది. అయితే 2010లో ఈపట్టాలను రద్దు చేసింది. అయితే అప్పటికే కొంతమందికి విక్రయించడంతో ఈభూమి ఇప్పటికే పలువురి చేతులు మారినట్లు సమాచారం. దీనికి సమీపంలోనే మరోవ్యక్తికి కూడా అప్పట్లో నదిపొరంబోకు చెందిన 1.75 ఎకరాలను సెటిల్‌మెంట్ పట్టాగా ఇచ్చి తిరిగి రద్దు చేసిందని సమాచారం.

తొక్కిసలాట ఘటనపై రేపటి నుంచి కీలక దశ విచారణ

● ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు నోటీసులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య న్యాయవిచారణ కమిటీ నాలుగవ దశ విచారణ బుధవారం నుంచి కలెక్టరేట్ వేదికగా రెండురోజుల పాటు జరగనుంది. ఈక్రమంలో కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి మంగళవారం రాత్రి తిరుపతికి చేరుకోనున్నారు. పద్మావతి పార్కు వద్ద తొక్కిసలాట ఘటనలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన నాటి క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ విచారణకు తనకు కొంత సమయం కావాలని కమిషన్‌ను అభ్యర్థించారు. దీంతో బుధవారం విచారణకు హాజరు కావాలని ఆయనకు కమిషన్ సమన్లు పంపింది. అభియోగాలు ఎదుర్కొన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కమిషన్ విచారించింది. తాజాగా డీఎస్పీ రమణకుమార్‌ను విచారించనున్నారు. అప్పటి విధుల్లో ఉన్న ఐఏఎస్ గౌతమి, ఐపీఎస్‌లు సుబ్బరాయుడు, శ్రీధర్‌తో పాటు కలెక్టర్, వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ హర్షవర్ధన్ రాజును కూడా విచారణకు రావాలని కమిషన్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. దీంతో తొక్కిసలాట ఘటన విచారణ ఓ కొలిక్కి రానుంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలో తిరుమల, తిరుపతిలో పునరావృతం కాకుండా చేపట్టాల్సిన అంశాలపై ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వనుంది.

భక్త జనసంద్రం ముక్కంటి క్షేత్రం



శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వారాంతపు సెలవులు, వరుసగా పండుగ సెలవలు రావడంతో ఆంధ్ర, తెలంగాణ నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 335 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,733మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,832మంది భక్తులు దర్శిం చుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,299మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,473, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 531, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 338, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 122 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,674 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ముక్కంటి సేవలో పట్నా హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్ర సూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరుడిని సోమ వారం పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డి కుటుంబ స మేతంగా దర్శించుకు న్నారు. ఆలయ అధికారు లు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కోరుకున్న వేళకే..స్థిరాస్తి రిజిస్ట్రేషన్

● రేపటినుంచి స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభం

● ప్రయోగాత్మకంగా చిత్తూరు ఆర్వోలో అమలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తాము కోరుకున్న వేళకే స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. ఇందుకోసం బుధవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించనుంది. ఈ నూతన ప్రక్రియను జిల్లాలోని చిత్తూరు రెవెన్యూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఆర్వో)లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ప్రస్తుతం శుభ ముహూర్తాలు చేసుకుని ఎక్కువ మంది స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. దీనివల్ల కొనుగోలు, విక్రయదారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. దీనికి స్వస్తి పలకడానికి కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. స్లాట్ బుకింగ్ విధానంపై జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బందికి, రాష్ట్రస్థాయిలో ఐజీ కార్యాలయంలో ఇదివరకే సిబ్బందికి పలు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆనవాయితీగా..

పదేళ్లుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన ప్రతి ప్రక్రియకు చిత్తూరు ఆర్వోను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ విజయవంతమయ్యాక దశలవారీగా జిల్లాలోని మిగతా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలిలా..

- గంటలు, రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితికి స్వస్తి
- క్రయ, విక్రయదారులతోపాటు అధికారులు, సిబ్బందికి ఒత్తిడి ఉండదు.
- దళారులు, డాక్యుమెంటు రైటర్ల ప్రభావం తగ్గుతుంది.
- దస్తావేజులు, దరఖాస్తులను సరిచూసుకోవడంలో గతంలో లాగా గందరగోళం ఉండదు.
- వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు దూరం
- అధికారులతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేయడానికి తగిన వాతావరణం ఉంటుంది.
- వీలునామా వంటి కీలక దస్తావేజుల్లో రాసిన వివరాలను చదివి, వినిపించే సమయంలో నిశ్శబ్ద వాతావరణం ఉంటుంది.

సేవలు పొందాలంటే..

- ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ ఎంపిక చేసుకుని వివరాలు పొందుపరచాలి.
- రిజిస్ట్రేషన్, ఇతర సేవలకు తమకు నచ్చిన తేదీ, సమయాన్ని ఎంచుకున్నాక క్యూఆర్ కోడ్‌తో ఒక టోకెన్ వస్తుంది.
- ఆ సమయానికి సంబంధిత టోకెన్, దస్తావేజులు, దరఖాస్తులతో కార్యాలయానికి వెళ్లి హాజరైతే గంట వ్యవధిలోనే ప్రక్రియ పూర్తవుతుంది.
- ఎనీవేర్ విధానంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలంటే మాత్రం నిర్ణీత తేదీకి ముందురోజు సంబంధిత దస్తాలను సంబంధిత కార్యాలయానికి ఆన్‌లైన్‌లో చేరేలా చూసుకోవాలి.
- స్లాట్ బుకింగ్ విధానం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది.
- స్లాట్ బుకింగ్ సేవలకు ఎలాంటి రుసుం ఉండదు.
- ఒకవేళ ఈ సేవలను రద్దు చేసుకోవాలంటే రూ.100 చెల్లించాలి. తిరిగి అదే సేవలను పొందాల్సి వస్తే రూ.200 కట్టాలి.



భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు




రంజాన్ వేడుకల్లో ముస్లింలతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు- ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్న ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తిరుపతి ఎస్వీయూ సమీపంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు నమాన్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ పేద, ధనిక తేడా లేకుండా అందరూ కలిసి ఉపవాస దీక్షలు పూర్తి చేసుకుని సామూహిక నమాజ్‌కు హాజరయ్యారని, అల్లా దయ అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. ఆదాయం లేని మసీదులకు నెలకు రూ.5వేలు, ఇమామ్‌లకు వేతనాల పెంపుపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కసరత్తు చేస్తున్నారని తెలిపారు. తిరుపతి ఈద్గా మైదానంపై రైల్వే అధికారులతో జరుగుతున్న వివాదాన్ని సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. లేనిపక్షంలో కలెక్టర్‌తో మాట్లాడి మైనార్టీలకు అనువైన ప్రాంతంలో ఈద్గా మైదానం ఏర్పాటుకు స్థల సేకరణకు చర్యలు తీసుకుంటానన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు విషయంలో ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా చేస్తామన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, కార్పొరేటర్లు, ముస్లిం పెద్దలు, ముతవల్లీలు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లతో నమాజ్‌కు..

రంజాన్ ప్రార్థనలకు ముందు సయ్యద్ షఫి అహ్మద్ ఖాదిరి మాట్లాడుతూ తిరుపతి ఈద్గా మైదానం కోసం మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్ ఎంతో చేశారని మాట్లాడుతుండగా పక్కనే ఉన్న వారు మైక్ లాక్కున్నారు. ఆ తర్వాత ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ షరీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో రద్దు చేయాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో ప్రార్థనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీంతో పలువురు ముస్లింలు చేతికి నల్ల రిబ్బన్లతో నమాజ్‌లో పాల్గొన్నారు.





రంజాన్ ప్రార్థనల్లో చిన్నారులు, టీడీపీ నాయకులు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణ, మబ్బుదేవనారాయణరెడ్డి, కోడూరు బాలసుబ్రమణ్యం, మాజీ ఎంపీ చింతామోహన్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు

గరుడ వాహనంపై జగదానందకారకుడు




మోహినీ అవతారంలో శ్రీరామచంద్రమూర్తి, గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తిరుపతి(టీటీడీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం జగదానంద కారకుడు ఉదయం మోహినీ అవతారంలో పల్లకిలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. 9.30 గంటలకు గజరాజుపై గరుడ పాదుకలు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగాయి. 10.30 నుంచి 11.30 గంటల వరకు సీతా లక్ష్మణ సమేత కోదండ రామస్వామికి వేడుకగా స్నపన తిరుమంజనం సాగింది. రాత్రి 7 గంటల నుంచి గరుడ వాహనంపై ఆశీనులైన స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు శ్రీరామ భజనలు చేస్తూ అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవల ముందు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొర్లగుంట మారుతీనగర్‌లో చోరీ

160 గ్రాముల బంగారు, 60 గ్రాముల వెండి అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కొర్లగుంట మారుతీనగర్‌లో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. 160 గ్రాముల బంగారు నగలు, 60 గ్రాముల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. క్రైం సీఐ ప్రకాష్ చెప్పిన వివరాల మేరకు.. కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన నాగార్జున చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. బ్యాంకులో భద్రపరచిన 160 గ్రాముల బంగారు నగలు, 60 గ్రాముల వెండి ఆభరణాలను ఉగాది సందర్భంగా విడుదల చేయించి, ఇంట్లోని బీరువాలో భద్రపరిచాడు. పండుగ కావడంతో కుటుంబ సమేతంగా విద్యానగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన బంగారు నగలు, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికొచ్చిన నాగార్జున ఇంటి తలుపులు తెరచి ఉండడం గమనించి లోనికెళ్లి చూశాడు. నగలు కనిపించకపోవడంతో ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు సీసీఎస్ పోలీసులకు కేసు రెఫర్ చేశారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీ శ్యాంసుందర్, సీఐ ప్రకాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. వేలిముద్రలు పరిశీలించారు. సీఐ ప్రకాష్ కేసు నమోదు చేశారు.

‘హిందూ ఉద్యోగుల పట్ల వివక్ష తగదు’

తిరుపతి(గాంధీరోడ్డు), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పండుగ సెలవుల విషయంలోనూ ఏపీ ప్రభుత్వం హిందూ ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం తగదని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల పేర్కొన్నారు. ఈ విషయంలో ఉద్యోగులు ఎన్ని అభ్యర్థనలు చేసినా స్పందించని ప్రభుత్వం ఇతర మతస్థుల పండుగ సెలవుల విషయంలో మాత్రం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని ఆరోపించారు. దీనికి ఈదుల్ ఫితర్ మరుసటి దినాన్ని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించడాన్ని ఉదహరించారు. ఉద్యోగులందరికీ సమన్యాయం వర్తించేలా చర్యలు చేపట్టాలని ప్రకటనలో కోరారు.

రేపటి నుంచి పాలిసెట్- 2025కు ఉచిత శిక్షణ

- ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 28 వరకు తరగతులు
- కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా పాలిసెట్‌కూ ఆన్‌లైన్ దరఖాస్తులు

తిరుపతి(విద్య), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్-2025కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి సోమవారం తెలిపారు. 2 నుంచి 28వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావచ్చునని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు ఉంటాయని, బాలికలకు, బాలురకు వేర్వేరుగా శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందజేస్తారని తెలిపారు. అలాగే టెన్త్ పరీక్ష రాసిన విద్యార్థులు ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా పాలీసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులను దాఖలు చేయొచ్చని వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి.శంకర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.

పోలీసుల సేవలు శ్లాఘనీయం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నో త్యాగాలు చేసి, పోలీసు శాఖకు సేవలు అందించడం శ్లాఘనీయమని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి అన్నారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ ప్రసాద్, తిరుపతి ఈస్ట్ స్టేషన్ ఏఎస్ఐ జి.శివకుమార్, డక్కిలి స్టేషన్ ఏఎస్ఐ బి.శ్రీనివాసులు, ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. వారిని పోలీసు అతిథి గృహంలో సత్కరించారు. అందరూ శేష జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని ఏఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, వారి కుటుంబ సభ్యులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో ఏఎస్పీ రవిమనోహరాచారి

తిరుపతి

రేపటి నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభించనున్నట్లు కేంద్ర నిర్వాహకులు పి.ముఖేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ట్యాలీ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు, 6 నుంచి 8 గంటల వరకు ఎంఎస్ ఆఫీస్, వర్డ్, ఎక్సెల్ తదితర కోర్సుల్లో నామమాత్రపు రుసుంతో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు 7వ తరగతి పూర్తయి ఉండాలని, వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వృత్తుల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలని, వివరాలకు 9966584759, 8985080370లను సంప్రదించాలని కోరారు.

రాస్ సేవలకు ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న రాస్ సంయుక్త కార్యదర్శి మమత

తిరుపతి(ఆటోనగర్), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాస్ చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి జిల్లా టూరిజం-సాంస్కృతిక కౌన్సిల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం-2025ను ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు, సంయుక్త కార్యదర్శి మమతలకు అదనపు జిల్లా కలెక్టర్, ఏపీ టూరిజం ఈడీ రమణ ప్రసాద్ అందజేశారు. తుడ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వారు ఈ అవార్డును అందుకున్నారు. పలువురు అభినందించారు.

6 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

తిరుపతి(టీటీడీ), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 6న శ్రీరామనవమి, 7న సీతారాముల కల్యాణం, 8న శ్రీరామ పట్టాభిషేకం జరగనున్నాయి. 9న సాయంత్రం వసంతోత్సవం, 10 నుంచి 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు.

టీటీడీ విశ్రాంత సీఈ జగ్గారావుకు నివాళి



జగ్గారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విభీషణశర్మ

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథంతో వృత్తి ధర్మాన్ని, సేవా ధర్మాన్ని సమ్మిళితంగా తన జీవితంలో ఆచరించి చూపెట్టిన ఘనత టీటీడీ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ జగ్గారావుకు దక్కుతుందని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు అన్నారు. తిరుపతిలోని ఫైన్ ఆర్ట్స్ కార్యాలయంలో సోమవారం జగ్గారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ, ఏపీ నాయుడు, రామచంద్ర నాయుడు, గీతాంజలి పాల్గొన్నారు.

ఈయూలో చేరికలు



ఈయూలో చేరిన తిరుమల డిపో నాయకులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు సమక్షంలో తిరుమల డిపోకు చెందిన వివిధ సంఘాల ప్రధాన నాయకులు 11 మంది సోమవారం ఆ యూనియన్ సభ్యత్వం పుచ్చుకున్నారు. సంఘం సిద్ధాంతాలకు కట్టుబడి వ్యవహరించాలని ఆయన కోరారు.

ఆర్టీసీలో పదోన్నతులు కల్పించాలి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా పెండింగులో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.దామోదరరావు, నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న వారిరువురు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు, డీఏ, సరండర్ లీవ్ నగదు చెల్లించాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. 2021 నుంచి రిటైరైన ఆర్టీసీ ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు హెల్త్‌స్కీమ్ అమలు చేస్తూ జీవో విడుదల చేసినా ఆరోగ్యశ్రీ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నిత్యావసర సరుకుల వితరణ



తిరుపతి(ఆటోనగర్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జి.కృష్ణయాదవ్ జన్మదినం సందర్భంగా సోమవారం బైరాగిపట్టెడలోని మాతృశ్రీ అనాథాశ్రమానికి నిత్యావసర సరుకులు వితరణ చేశారు. తిమ్మినాయుడపాళెం ఎన్టీఆర్ విగ్రహం, గోవిందరాజస్వామి కోనేరు వద్ద అన్నదానం చేశారు.

డాక్టర్ జగదీష్‌కు

‘విశ్వవైద్య దివ్యాంగ బంధు’ అవార్డు

మారిషస్ ప్రధాని చేతుల మీదుగా ప్రదానం



తిరుపతి(వైద్యం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు విశేష సేవలందించడమేగాక ఎముకల వ్యాధి నివారణలో చేసిన కృషికి బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌కు విశ్వ వైద్య దివ్యాంగ బంధు అవార్డు దక్కింది. మారిషస్ రాజధానిలోని ఫీనిక్స్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆ దేశ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్ చంద్రరామ్ గులామ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. మారిషస్ ప్రజలకు మరింతగా సేవలు అందించాలని జగదీష్‌ను ప్రధాని కోరారు. పలువురు వైద్య నిపుణులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీకి గురునాథం సేవలు భేష్



గురునాథాన్ని సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.గురునాథం ఆర్టీసీకి అందించిన సేవలు భేష్ అంటూ పలువురు వక్తలు కొనియాడారు. గురునాథం ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక లీలామహల్ కూడలిలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఈయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.దామోదరం, నరసయ్య, ఈడీ చెంగల్‌రెడ్డి కలిసి గురునాథంను సన్మానించారు. ఆయన ఆర్టీసీలో కండక్టర్‌గా చేరి పదోన్నతిపై కంట్రోలర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా 38ఏళ్లుగా విధులు నిర్వహించారని, యూనియన్‌లోనూ చురుగ్గా వ్యవహరిస్తూ ఉద్యోగులకు సహకరించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర నాయకులు పి.సుబ్రహ్మణ్యంరాజు, ఆవుల ప్రభాకర్‌యాదవ్, అర్జునయ్య, బాబూసామ్యూల్, జిల్లా నాయకులు జి.ఆర్.చంద్ర, మస్తాన్, జె.సతీష్‌నాయుడు, సుబ్బు, వర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

25న ప్రేక్షకుల ముందుకు ‘ఏఎల్‌సీసీ’



టీజర్, పోస్టర్ విడుదల చేస్తున్న సినిమా బృందం

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): బ్యాచులర్ జీవితంపై ఆసక్తికర కథనంతో రూపొందించిన ఏఎల్‌సీసీ (యాంటీ లేడీ కమిటీ ఛైర్మన్) చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర నిర్మాత, దర్శకుడు లేలీధరరావు తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం చిత్రం బృందం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 థియేటర్లలో విడుదల చేయనున్నామని వెల్లడించారు. తిరుపతితో పాటు నెల్లూరు జిల్లాలో సినిమా చిత్రీకరణ పూర్తి చేశామన్నారు. తిరుపతిలో చదువుకున్న నవీన్ హీరోగా, హైదరాబాద్‌కు చెందిన శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటించారన్నారు. అనంతరం సినిమా టీజర్‌ను, పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు జస్వంత్, నటులు కమల్, శ్రీనివాసరెడ్డి, ధనుష్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీమద్రామాయణ ప్రవచనామృతం ప్రారంభం



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రముఖులు

తిరుపతి (టీటీడీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీమద్రామాయణ ప్రవచనామృతాన్ని డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ సోమవారం ప్రారంభించారు. తిరుపతిలోని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, రామకృష్ణ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏప్రిల్ 6వ తేదీ వరకు సాగ నుంది. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆశ్రమంలోని వివేకానంద సభా ప్రాంగణంలో జరుగుతుంది.

సైకం జయచంద్రారెడ్డికి బ్రాహ్మణమిత్ర పురస్కారం



జయచంద్రారెడ్డికి అవార్డు అందిస్తున్న ఎన్ఎస్‌యూ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డికి బ్రాహ్మణమిత్ర పురస్కారం లభించింది. తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. భీమాస్ బాలాజీ, బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు ఆయన్ను అభినందించారు.

పదవికి వన్నె తెచ్చేలా కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి) : తనకు ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులకు మేలు జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర యాదవ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 43 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక పదవుల్లో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేశానన్నారు. వైసీపీ హయాంలో యాదవ కార్పొరేషన్ సమావేశం నిర్వహించినట్లు రుజువులు లేవని, మినిట్స్ బుక్ కూడా నిర్వహించలేదని అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం నిర్వహించి, యాదవ కార్పొరేషన్ ద్వారా అందరికీ మేలుచేసే ఆలోచన ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి యాదవుల ఆర్థిక చైతన్యం, తిరుపతిలోని బీసీ భవన్, జగ్జీవన్‌రామ్ భవనం, జర్నలిస్టుల హసింగ్ స్కీమ్ కోసం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, కట్టా జయరాం యాదవ్, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

లో వోల్టేజ్ నివారణకు చర్యలు



సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో లో వోల్టేజ్ సమస్య తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ఈ ఏడాది మార్చిలోనే ఎండలు తీవ్రంగా ఉండడంతో పాటు విద్యుత్ వినియోగం బాగా పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచన మేరకు డీఈఈ శేఖర్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో అధికారులు పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. లో వోల్టేజ్ సమస్య ఉన్న చోట అనదంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సూళ్లూరుపేట పట్టణం, రూరల్ ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ పార్టీ నాయకుల అజమాయిషీ భరించలేక విధి నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదు. బాధ్యతలు తీసుకొన్న వారు కూడా వారం రోజులకు మించి పనిచేయకుండానే బదిలీపై వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న సూళ్లూరుపేట పట్టణం, రూరల్ ఏఈ పోస్టులను భర్తీ చేసింది. ఎక్కడ చిన్నపాటి సమస్య వచ్చినా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నారు. వేసవి కాలంలో గతంలో పట్టణంలో కరెంట్ సరఫరా సక్రమంగా ఉండేది కాదు. లో వోల్టేజ్ సమస్య లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్ డివిజన్ పరిధిలో 15 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని డీఈఈ తెలిపారు. అదే విధంగా వ్యవసాయానికి సంబంధించి కూడా కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలో తడ మండలంలో తడ బీసీ కాలనీ, రైల్వేస్టేషన్, అయ్యప్పనగర్, ఓబాలమ్మ గుడి, తడ హరిజనవాడ, సూళ్లూరుపేటలో ఆర్అండ్‌బీ బంగ్లా, షార్ సర్కిల్ రోడ్డు, అంబేడ్కర్ గురుకులం, కోటపోలూరు బీసీ కాలనీ, డేగలపాలెం, మన్నారుపోలూరు, కోళ్లమిట్ట తదితర ప్రాంతాలతో పాటు దొరవారిసత్రం మండలంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు చేపడుతున్నారు.

డాక్టర్ జగదీష్‌కు 'విశ్వవైద్య దివ్యాంగ బంధు' అవార్డు

మారిషస్ ప్రధాని చేతుల మీదుగా ప్రదానం



తిరుపతి(వైద్యం), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు విశేష సేవలందించడమేగాక ఎముకల వ్యాధి నివారణలో చేసిన కృషికి బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌కు విశ్వవైద్య దివ్యాంగ బంధు అవార్డు దక్కింది. మారిషస్ రాజధానిలోని ఫీనిక్స్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆ దేశ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్ చంద్రరామ్ గులామ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. మారిషస్ ప్రజలకు మరింతగా సేవలు అందించాలని జగదీష్‌ను ప్రధాని కోరారు. పలువురు వైద్య నిపుణులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మార్కెట్ యార్డ్ ఏర్పాటు కలేనా?



15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోర్డు

దొరవారిసత్రం, మార్చి31 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు మోక్షం లభించడంలేదు. 15 ఏళ్ల క్రితం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పక్కన జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పది ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ యార్డ్‌కు కేటాయించారు. ఆ స్థలంలో బోర్డు కూడా ఏర్పాటు చేశారు. తరువాత అడుగు ముందుకు పడలేదు. మండలంలో వరితో పాటు మిర్చి, వేరుశనగ పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. పంట ఉత్పత్తులను దాచుకుని మద్దతు ధర లభించినప్పుడు అమ్ముకోవడానికి మార్కెట్ యార్డ్ ఎంతో అవసరం. రైతులు ధాన్యం దాచుకోవడానికి తంటాలు పడుతున్నారు. గత్యంతరం లేక దళారులు చెప్పిన రేటుకే విక్రయించి నష్టపోతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ చూపి మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పూలతోటలో పోలీసుల పల్లెనిద్ర



గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

దొరవారిసత్రం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలతోట గ్రామంలో ఆదివారం రాత్రి దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పల్లెనిద్ర చేశారు. కొత్త వాహన చట్టాలు, శక్తి యాప్, సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, ఇళ్లకు స్మార్ట్ లాక్, డయల్ 100, 112 నెంబర్లు గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కమనీయం... వెంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోట, ఆంధ్రజ్యోతి మార్చి 31: మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాలెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ధర్మకర్త నేదురమల్లి ప్రసేన్‌కుమార్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరుడి కల్యాణాన్ని వేద పండితులు అనంతాచార్యులు భక్తుల సమక్షంలో జరిపారు.

రేపటి నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభించనున్నట్లు కేంద్ర నిర్వాహకులు పి.ముఖేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ట్యాలీ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు, 6 నుంచి 8 గంటల వరకు ఎంఎస్ ఆఫీస్, వర్డ్, ఎక్సెల్ తదితర కోర్సుల్లో నామమాత్రపు రుసుంతో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు 7వ తరగతి పూర్తయి ఉండాలని, వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వృత్తుల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలని, వివరాలకు 9966584759, 8985080370లను సంప్రదించాలని కోరారు.

కొర్లగుంట మారుతీనగర్‌లో చోరీ

160 గ్రాముల బంగారు, 60 గ్రాముల వెండి అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని కొర్లగుంట మారుతీనగర్‌లో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. 160 గ్రాముల బంగారు నగలు, 60 గ్రాముల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. క్రైం సీఐ ప్రకాష్ చెప్పిన వివరాల మేరకు.. కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన నాగార్జున చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. బ్యాంకులో భద్రపరచిన 160 గ్రాముల బంగారు నగలు, 60 గ్రాముల వెండి ఆభరణా లను ఉగాది సందర్భంగా విడుదల చేయించి, ఇంట్లోని బీరువాలో భద్రపరి చాడు. పండుగ కావడంతో కుటుంబ సమేతంగా విద్యానగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన బంగారు నగలు, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికొచ్చిన నాగార్జున ఇంటి తలుపులు తెరచి ఉండడం గమనించి లోనికెళ్లి చూశాడు. నగలు కనిపించక పోవడంతో ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు సీసీఎస్ పోలీసులకు కేసు రెఫర్ చేశారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీ శ్యాంసుం దర్, సీఐ ప్రకాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. వేలిముద్రలు పరిశీలించారు. సీఐ ప్రకాష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మ గ్రామోత్సవం

గూడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా గంగమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా లలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి మంగళ వాద్యాలు, తప్పెట్లు తాళాలు, యువత నృత్యాల నడుమ ఆదివారం రాత్రి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొనసాగిన గ్రామోత్సవం సోమవారం సాయంత్రం ఆలయం వద్దకు చేరుకుంది. గొల్లలు గంగపెట్టెను ఊరేగిస్తూ వీరతాళ్లతో నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గ్రామోత్సవంలో గంగమ్మ

బ్యాంకు లింకేజీ రుణం... మహిళలకు వరం

● స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి మార్చి 31: పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లభిస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తుండడంతో ఆయా సంఘాల సభ్యులు స్వయం ఉపాధితో పొందుతున్నారు. చిరువ్యాపారాలు ప్రారంభించి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. పెళ్లకూరు మండలంలో 871 మహిళా సంఘాల్లో 9060 మంది సభ్యులు ఉన్నారు. నాలుగన్నరేళ్లలో మహిళా సంఘ సభ్యులు కోట్లాది రూపాయలు రుణాలు పొందారు. కిరాణా, చిల్లర వ్యాపారాలతో పాటు వస్త్రాల విక్రయం, టైలరింగ్ శిక్షణ కేంద్రాలతో పాటు వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవడంతో పాటు పొదుపు నగదును వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించుకుంటూ కుటుంబాలకు ఆసరగా నిలుస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి కింద 324 మహిళా సంఘాలు రూ.7.43 కోట్ల రుణాలు పొందగా, ఉన్నతి పథకం కింద 354 సంఘాలు రూ1.42 కోట్లు తీసుకున్నాయి. అదేవిధంగా బాంకు లింకేజీల ద్వారా 467 మహిళా సంఘాల సభ్యులు రూ.28.48 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ రుణాలతో స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.



పొదుపు మహిళలతో సమావేశమైన వెలుగు సీసీలు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో మాదిరి కాకుండా పొదుపు మహిళలకు ఏ అవసరం కోసం, ఎప్పుడు, ఎంత రుణం కావాలో తెలుసుకొని ఇవ్వనుంది. స్వయం ఉపాధికి అవసరమైన రుణం సకాలంలో అందివ్వడం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధిలో ముందుడుగు వేస్తున్నారు.

- హేమామాలిని, వెలుగు ఏపీఎం





వెంకటగిరి ఈద్ దర్గాలో ఎమ్మెల్యే కురుగొండ్ల ప్రార్థనలు - నాయుడుపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

భక్తి శ్రద్ధలతో రంజాన్

గూడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక నమాజు కట్ట, పెద్దమసీదు, నూర్‌మసీదు తదితర ప్రాంతాల్లో ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలియజేసుకున్నారు. అదేవిధంగా చిన్న మసీదు, రాణిపేట, ఇందిరానగర్, గాంధీనగర్, వీరారెడ్డిపల్లి, బనిగిసాహెబ్‌పేట, మండల పరిధిలోని పోటుపాళెం, విందూరు, చెన్నూరు, తిప్పవరప్పాడు ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వక్ఫ్‌బోర్డు రద్దు బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు చేతికి నల్లరిబ్బన్లు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదుల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పట్టణ సీఐ శేఖర్‌బాబు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

సూళ్లూరుపేట: మండలంలోని మన్నారుపోలూరులో ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలితో పాటు రాచపాళెం, ఆరిమేనిపాడు, కార్జిమేడు, అత్తివరం, కరబల్లవోలు, కురుగొండ గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కైవల్యా నది ఒడ్డున ఉన్న ఈద్గాలో ముస్లిం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వక్ఫ్‌బోర్డు రద్దును వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు.

వెంకటగిరి: పట్టణంలోని ఈద్ దర్గాలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాధ నాయుడు, ఖరీముల్లా, మస్తాన్, అల్తాఫ్, గౌస్ పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు నెలవల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

తడ: మండలంలోని పూడికుప్పం జాతీయ రహదారి వద్ద ఉన్న ఈద్గా, బీములవారిపాలెం వద్ద ఉన్న మసీదుల్లో ముస్లిం మతపెద్దలు హుస్సేన్, ఫక్రుద్దున్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాక గ్రామ శివారులో ఉన్న ఈద్గాలో ముస్లింలు మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోట: మండల కేంద్రంలోని జామా మసీదు, శ్యామసుందరపురంలోని ఈద్గా, నెల్లూరుపల్లి, గోవిందపల్లి, చంద్రశేఖరపురం గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

గరుడ వాహనంపై జగదానందకారకుడు





మోహినీ అవతారంలో శ్రీరామచంద్రమూర్తి - గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తిరుపతి(టీటీడీ), మార్చి 31(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం జగదానందకారకుడు ఉదయం మోహినీ అవతారంలో పల్లకిలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. 9.30 గంటలకు గజరాజుపై గరుడ పాదుకలు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగాయి. 10.30 నుంచి 11.30 గంటల వరకు సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామికి వేడుకగా స్నపన తిరుమంజనం సాగింది. రాత్రి 7 గంటల నుంచి గరుడ వాహనంపై ఆశీనులైన స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు శ్రీరామ భజనలు చేస్తూ అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవల ముందు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కుటుంబసభ్యులతో సీతాదేవి

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ పీఎం వీపీ సింగ్ సతీమణి సీతాదేవి, సినీ నిర్మాత బండ్ల గణేష్, ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

కూర్మావతారంలో కోదండరాముడు



సూళ్లూరుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల ఆలయంలో జరుగుతున్న వసంతనవరాత్రుల వేడుకల్లో భాగంగా సోమవారం కోదండరాముడు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు చేశారు. అదే విధంగా బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా రెండోరోజు స్వామివారు వామన అవతారంలో దర్శనమిచ్చారు.

అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్ కుమార్‌రెడ్డి

గూడూరు అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్‌గా నియమితులైన సురేష్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కాశీ లేఅవుట్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, కోటేశ్వరరావు, మధుసూదన్, నందవరం సుబ్బారావు, శివయ్య, నవీన్‌కుమార్‌రెడ్డి, వినయ్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పదవికి వన్నె తెచ్చేలా కృషి చేస్తాను



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి(కల్చరల్), మార్చి 31(ఆంధ్రజ్యోతి): తనకు ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులకు మేలు జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర యాదవ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 43 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక పదవుల్లో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేశానన్నారు. వైసీపీ హయాంలో యాదవ కార్పొరేషన్ సమావేశం నిర్వహించినట్లు రుజువులు లేవని, మినిట్స్ బుక్ కూడా నిర్వహించలేదని అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం నిర్వహించి, యాదవ కార్పొరేషన్ ద్వారా అందరికీ మేలుచేసే ఆలోచన ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి యాదవుల ఆర్థిక చైతన్యం, తిరుపతిలోని బీసీ భవన్, జగ్జీవన్‌రామ్ భవనం, జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ కోసం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, కట్టా జయరాం యాదవ్, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

ఎస్వీ పాలిటెక్నిక్‌లో 28 వరకు తరగతులు

కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్-2025కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి సోమవారం తెలిపారు. 2 నుంచి 28వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావచ్చునని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు ఉంటాయని, బాలికలకు, బాలురకు వేర్వేరుగా శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందజేస్తారని తెలిపారు. అలాగే టెన్త్ పరీక్ష రాసిన విద్యార్థులు ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా పాలీసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులను దాఖలు చేయొచ్చని వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి.శంకర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.

రాస్ సేవలకు ఉగాది పురస్కారం

తిరుపతి(ఆటోనగర్), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాస్ చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి జిల్లా టూరిజం-సాంస్కృతిక కౌన్సిల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం-2025ను ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు, సంయుక్త కార్యదర్శి మమతలకు అదనపు జిల్లా కలెక్టర్, ఏపీ టూరిజం ఈడీ రమణ ప్రసాద్ అందజేశారు. తుడ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వారు ఈ అవార్డును అందుకున్నారు. పలువురు అభినందించారు.



రాస్ ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి మమతలకు ఉగాది పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పద్మావతీదేవి సేవలో జస్టిస్ కృపాసాగర్

తిరుచానూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని సోమ వారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జస్టిస్ కృపాసాగర్ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయలో పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో బాపిరెడ్డి ఉత్తర్వులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ప్రోటోకాల్ విభాగం ఇన్‌ఛార్జిగా ఏఈవో సతీష్‌మాలిక్‌ను, ఏఈవో విద్యాసాగర్‌ను ప్రోటోకాల్‌నుంచి ఆలయం, ప్రసాదం పోటు పర్యవేక్షణకు, ఏఈవో లోకేష్‌బాబును ఆలయం, పోటు నుంచి ల్యాండ్స్, లీగల్ విభాగానికి బదిలీ చేశారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న రాజేశ్వరిని లోబావి ఇంజనీరింగ్ కార్యకలాపాల నుంచి స్కిట్ నర్సింగ్ కళాశాలకు, అలాగే ఏఈ శోభారాణిని శివసదన్ అతిథిగృహం నుంచి లోబావి ఇంజనీరింగ్ కార్యకలాపాలకు, స్థపతి కుమార్‌ను మింట్‌కు బదిలీ చేశారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అడ్డాగా అమ్మవారి గర్భాలయం

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అమ్మవారి గర్భాలయ సన్నిధి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉదయ్ అడ్డాగా మారిందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. వైసీపీ పాలకుల అండతో ఉదయ్ ఐదేళ్లు నిర్విరామంగా అమ్మవారి సన్నిధిలో పర్యవేక్షకుడిగా పనిచేశాడు. దళారీల నుంచి వాటాలుగా తీసుకుంటూ అడ్డదారిలో ఇష్టారాజ్యంగా అంతరాలయానికి ఆ ఉద్యోగి అనుమతిస్తూ పట్టుబడ్డాడు. గత వైసీపీ పాలనలో పలుమార్లు ఈయనపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తినప్పటికీ అప్పటి నేతల అండతో ఆ స్థానం నుంచి కదలకుండానే విధులు నిర్వహించాడు. అలాగే గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు భక్తులతో దురుసుగా ప్రవర్తించడంపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అయినా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 9 నెలల క్రితం టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముక్కంటి ఆలయంలో ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట వేసిన 77మంది అధికారులు, ఉద్యోగులను ఒకే సారి అంతర్గతంగా బదిలీ చేశారు. ఆ సమయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉదయ్‌ను అమ్మవారి సన్నిధి నుంచి అతిథిగృహం ఇన్‌ఛార్జిగా బదిలీ చేశారు.

పది రోజుల్లోనే...

అయితే ఆయన పదిరోజుల తరువాత మళ్లీ అమ్మవారి గర్భగుడి విధులనే కొనసాగించారు. ఏం జరిగిందో తెలి యదు కానీ అధికారికంగా అతిథిగృహంలో విధులు కేటాయించినప్పటికీ 8 నెలలుగా అనధికారికంగా మరింత దర్పంతో అమ్మవారి గర్భగుడి వద్ద తిష్ట వేశాడు. ఇటీవల నెల రోజుల నుంచి ఆ ఉద్యోగి ప్రవర్తనపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయిన వారిని, దళారీలను నేరుగా అడ్డదారిలో అమ్మవారి దర్శనానికి అనుమతిస్తున్నారని విమర్శిస్తున్నారు. కొందరు భక్తులు రూ.500 నగదు వెచ్చించి అంతరాలయ టిక్కెట్టు కొనుగోలు చేసి నిబంధన ప్రకారం ఆలయంలోకి వెళ్తున్నా వారిపై చిర్రుబుర్రులాడుతున్నట్టు చెబుతున్నారు. దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు వాపోతున్నారు. అందరూ ఉద్యోగులు అంతర్గతంగా బదిలీ అవుతున్నా ఒప్పంద ఉద్యోగి ఉదయ్ మాత్రం అమ్మవారి సన్నిధిని అడ్డాగా మార్చుకున్నాడని ఆలయంలోని సహచర ఉద్యో గులు అంతా బాహటంగా విమర్శిస్తున్నారు.

సన్‌రైజ్‌లో రోబోటిక్స్ సందడి



రోబో గురించి విద్యార్థులకు వివరిస్తున్న కరస్పాండెంట్

సత్యవేడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సన్‌రైజ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల చైర్మన్ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2డీ, 3డీ, ఏఎల్ రోబోలను ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సతీష్ మా ట్లాడుతూ విద్యార్థులను భావి శాస్త్రవే త్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తమ పాఠ శాలలో ప్రత్యేకంగా రోబోటిక్ క్లాసులను ప్రవేశ పెడు తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి శుక్రవారం విద్యార్థులకు రోబోల ప్రదర్శనను నిర్వహి స్తామన్నారు. కార్యక్రమంలో రోబోటిక్స్ కంపెనీ మేనేజర్ చరణ్, ప్రిన్సిపాల్ ఆశా గోపాల్, ఉపాధ్యాయులు నిర్మల, ఉమ, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పట్నా హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండి తులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి



శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్ర జ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మహ్మదీయ మసీదు అధ్యక్షుడు ఎస్. గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని భాస్కరపేటలో ఉన్న మహ్మదీయ మసీదు వద్ద రంజాన్ రోజున ముస్లింలు చేతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ముస్లింలను వంచించేలా ఉన్న ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ చట్ట సవరణ ద్వారా వక్ఫ్ బోర్డులపై స్వయం ప్రతిపత్తిని దెబ్బతింటుందన్నారు. మహమ్మద్, ముజామ్మిల్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ వేదపండితుడు నారాయణస్వామికి ఉగాది పురస్కారం



శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ వేదపండితుడు నారాయణస్వామి ఉగాది పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలు విభాగాల్లో విశేష సేవలందించిన వారిని పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి వేదపండితుడు నారాయణస్వామి ఆదివారం విజయవాడలో సీఎం నారాచంద్రబాబు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ మేరకు సోమవారం పలువురు ఆలయ అధికారులు, సిబ్బంది నారాయణస్వామిని ఘనంగా అభినందించారు.

పుత్తూరు వార్తలు

భక్తిశ్రద్ధలతో రంజాన్





పుత్తూరులో నమాజు చేస్తున్న ముస్లింలు - చీరల పంపిణీలో టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నరాజుకుప్పంలో ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, నాయకులు విజయ్‌చౌదరి, కుమార్‌రెడ్డి, మణికంఠ, అజయ్ చౌదరి, పరంధాం, గిరి నాయుడు, పోతుగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగను పరస్కరించుకుని పుత్తూరు పట్టణంలోని ఈద్గా మసీదు, జమా మసీదు, గేటు పుత్తూరులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బెట్టింగ్‌లపై హెచ్చరిక

కేవీబీపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే తీవ్రంగా పరిగణించి కఠిన శిక్షలు విధించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని ఎస్‌ఐ నరేష్ చెప్పారు. తమ పిల్లలు పెడదారి పట్టకుండా వారి తల్లిదండ్రులు వారిని అదుపులో ఉంచుకోవాలన్నారు. మండలంలో బెట్టింగ్‌పై నిఘా ఉంచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నిరుపయోగంగా తెలుగుగంగ కార్యాలయం





ఆరుబయట నిరుపయోగంగా ఫర్నిచర్ - చెత్తకుప్పలు పేరుకుపోయిన ప్రాంగణం

శ్రీకాళహస్తి,మార్చి 31(ఆంధ్రజ్యోతి): తెలుగు పాత కార్యాలయం నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఉన్న తెలుగుగంగ ప్రధాన కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంటోంది. అయితే కనీసం కార్యాలయంలోని ఫర్నిచర్‌ను కూడా తరలించకుండా అక్కడే వదలిపెట్టారు. చెట్ల కింద ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తప్పు పట్టిపోతు న్నాయి. పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ఫర్నిచర్ కొరత ఉంది. ప్రధానంగా సచివాలయాల్లో ఈ సమస్య వెంటాడుతోంది. ప్రభుత్వ వసతి గృహాల్లో కూడా ఫర్నిచర్ అవసరం ఉంది. పాత కార్యాలయం భవనం లోపల ఫర్నిచర్ కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితిలో ఉంది. అధికారులు స్పందించి ఉపయోగకరంగా మార్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఇరుకు గదుల్లో ఆర్డీవో కార్యాలయం...

అలాగే పాత తెలుగుగంగ కార్యాలయాన్ని మరమ్మతులు చేస్తే ఉపయోగకరంగా మారుతుంది. ఆర్డీవో కార్యాలయం ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో ఇరుకు గదిలో ఉంది. విస్తారమైన పాత తెలుగుగంగ భవనాన్ని మరమ్మతులు చేసి ఆర్డీవో కార్యాలయం వంటి కేంద్రాలకు ఉపయోగించుకోవచ్చు.

ఘనంగా రంజాన్ వేడుకలు





శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం ఈద్గాలలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో రంజాన్ పర్వ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పెద్దమసీదు, చిన్నమసీదు, కుమారస్వామి తిప్పవీధి తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈదులగుంట ఈద్గా, అయ్యలనాడు చెరువులోని ఈద్గాతో పాటు పలు పవిత్ర ప్రదేశాల్లో ముస్లింల ప్రార్థనలు జరిగాయి. అయా ప్రార్థనల్లో మతపెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. అనంతరం ముస్లింలు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి సీఎం చంద్రబాబుతో ప్రత్యేక సమావేశం ఉండటంతో ఈ వేడుకల్లో ఎమ్మెల్యే సుధీర్ ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయారు. మొబైల్ ద్వారా ఎమ్మెల్యే తన సందేశాన్ని వినిపించారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో రంజాన్ మాసం ముగిసిందన్నారు. జకాత్ పేరుతో సాటి వారిని ఆదుకునే దయాగుణం ముస్లిం వర్గంలోని మానవత్వానికి ప్రతిరూపంగా పేర్కొ న్నారు. ఈ పండుగ మన సమాజంలో ఆశ, సామరస్యం, కరుణ స్ఫూర్తిని పెంపొందించి విజయం కలగాలన్నారు. ప్రేమ, కరుణ, ఐకమత్యం సందేశాలతో సేవతత్పరత, ఆధ్యాత్మిక వెల్లివిరిసే ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన అల్లా కరుణ కటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలను నిర్వహించుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని ఇందిరానగర్, ముస్లింపాళెం తదితర ప్రాంతాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. వరదయ్యపాళెం ఎస్‌ఐ మల్లికార్జున ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిగుంట, పెరిందేశం, అంజూరు, కర్లపూడి, ఓళ్లూరుల్లో ముస్లింలు రంజాను పండును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమకున్న దానిలో పేదవారికి సాయం చేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఐదు మసీదులకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ ముతవల్లీలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): అల్లా దయతో అందరూ బాగుండాలని జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మసీదులో రంజాన్ సందర్భంగా ముస్లిం లతో కలిసి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం చేశారు.

సత్యవేడు(ఆంధ్రజ్యోతి): ముస్లింల పర్వదినం రంజాన్‌ను సోమవారం సత్యవేడు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆదివారం సాయంత్రం షవ్వాల్ నెలవంక దర్శనం కావడంతో నెల రోజుల పాటు సాగిన ఉపవాస దీక్షను ముగించుకుని రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. దాసుకుప్పం, శిరుణంబూదూరు, ఏఎంపురం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మసీదులో ఇమాం పవిత్ర ఖురాన్ సూక్తులను పఠించి అల్లా శాంతి సందేశాలను వినిపించారు. పరమత సహనం, దీనులపై దయా, జాలి, కరుణ కలిగి ఉండాలన్నదే ఇస్లాం ప్రబోధిస్తుందన్నారు. బంధుమిత్రులకు, పిల్లలకు రంజాన్ కానుకలను పంచి పెట్టారు.

నాగలాపురం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు టీపీకోటలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి మసీదులకు చేరుకుని పవిత్ర ఈదుల్ ఫితర్ నమాజును చదివి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాగలాపురం రాజీవ్‌నగర్‌లోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు జరిగాయి.







రేణిగుంట, నాగలాపురం ముస్లింల నమాజు - నారాయణవనం మసీదు వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సుమన్ తదితరులు

గృహ లబ్ధిదారులపై 'రెవెన్యూ' దందాలను ఆపాలి

వరదయ్యపాళెం, మార్చి 31: మండలంలోని వీకేఆర్‌వై కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలపై రెవెన్యూ అధికారుల దందాలు ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల ప్రాంతీయ కార్యదర్శి రమేష్ కోరారు. సోమవారం వీకేఆర్‌ఐ కాలనీలో పర్యటించిన అనంతరం వారు మాట్లాడుతూ... నెల్లూరు జిల్లా నుంచి వలస వచ్చి 20 సంవత్సరాలుగా స్థిరపడి స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుంటున్న వారిపై చిన్నపాండూరు వీఆర్వో, వీఆర్‌ఏలు మామూళ్ల కోసం వేధించడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ స్పందించాలని కోరారు.

బీజేపీ మండల నూతన కమిటీ

వరదయ్యపాళెం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ మండల కమిటీ నియామకం మండల అధ్యక్షుడు దిలీప్‌రాయల్ అధ్యక్షతన జరిగింది. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆర్వోలుగా భాస్కర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సిద్ధులయ్య పాల్గొన్నారు. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జయశంకర్, బి.నాగేశ్వరరావు, నందిని, భాగ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, దారా రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా వి.సూర్యనారాయణ, కార్యదర్శులుగా మోహన్‌శెట్టి, ఇళయరాజా, హరిబాబు, టి.ఎల్లయ్య, యువమోర్చా మండల అధ్యక్షుడిగా పి.భాస్కర్‌ను ఎన్నుకున్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వి నా యకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హార తులిచ్చారు. అనంతరం స్వామివారిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప, నై వేద్యాలు, మహామంగళ హారతులు సమ ర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

భక్త జన సంద్రం ముక్కంటి క్షేత్రం



శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వారాంతపు సెలవులు, వరుసగా పండుగ సెలవలు రావడంతో ఆంధ్ర, తెలంగాణ నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 335 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,733మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,832మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,299మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,473, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 531, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 338, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 122 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,674 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వీరభద్రయ్య సేవలు ప్రశంసనీయం



వీరభద్రయ్య దంపతులను సన్మానిస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ జమేదారు మైనంపాటి వీరభద్రయ్య సోమ వారం పదవీ విరమణ పొందారు. ఈ సంద్భంగా వీరభద్రయ్య దంపతులను ఈవో బాపిరెడ్డి ఘనంగా సత్కరించి ముక్కంటి జ్ఞాపికను అందజేశారు. వీరభద్రయ్య సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంలో మంచిని మాత్రం తీసుకోండి

పిచ్చాటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచాన్ని అందిపుచ్చుకుంటున్న యువతకు మంచిని మాత్రమే గ్రహించి చెడు జోలికి వెళ్లొద్దని ఎస్‌ఐ వెంకటేశ్వరులు సూచించారు. సోమవారం బజారువీధిలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు పక్కన నూతన హైటెక్ కంప్యూటర్ టైపింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆయన ప్రారంభించారు. కాగా వేసవిలో విద్యార్థుల కోసం 75 శాతం రాయితీతో కంప్యూటర్ శిక్షణ ఉంటుందని యాజమాన్యం తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న గోపి

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు కర్మాగార కార్మికుడు గాయపడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని ఈదులగుంటకు చెందిన గోపి (31) సూళ్ళూరుపేటలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి సొంత పనులనిమిత్తం ద్విచక్ర వాహనంపై తొట్టంబేడు మండలం కన్నలికి వెళ్లాడు. ఈ క్రమంలో కన్నలి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు గుర్తించి గోపిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి



చికిత్స పొందుతున్న మురళీమోహన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి మురళీమోహన్‌రెడ్డి(35)పై దాడి చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుడి తెలిపిన వివరాలు... అమ్మపాళెంకు చెందిన మురళీమోహన్‌రెడ్డి శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద ఉన్న ప్రైవేటు కర్మాగారంలో డ్రైవర్. సోమవారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంటి వద్దకు చేరుకుని నిద్ర లేపారు. అయితే పథకం ప్రకారం కర్రలతో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా దాడి చేసి పరారయ్యారు. మురళీమోహన్‌రెడ్డి కేకలు విన్న స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు అతని ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు విచారణను చేపట్టారు.

అభయ క్షేత్రంలో పండ్ల పంపిణీ



శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మాధురి గోల్డ్ యాజమాన్యం రేణిగుంటలోని అభయ క్షేత్రంలో వృద్ధులకు పాలు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. యేటా తాము పంపిణీ చేస్తుంటామని తెలిపారు.